క్లుప్తంగా

బదిలీపై 58మంది టీచర్లు వచ్చారు

రొంపిచెర్ల: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో 58 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీ చేసిందని ఎంఈవో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. మండలం నుంచి 48 మంది ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లగా, ఇతర ప్రాంతాల నుంచి 58 మంది మండలానికి వచ్చారని తెలిపారు. మండలంలో ఎక్కడ ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని కోరారు.

మళ్లీ ఈకేవైసీ అవసరం లేదు

సదుం: గతంలో పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేయించుకున్న వారు మళ్లీ అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించికోవాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. దీనికిగాను ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు విడు దల చేసిందని చెప్పారు. తెలిపారు. గతంలో ఈకేవైసీ చేయించుకోని వారి జాబితా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందన్నారు.

తహసీల్దారుగా ప్రమీల



సదుం: తహసీల్దారుగా ప్రమీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కడప కలెక్టరేట్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు జయప్రకాశ్ చిత్తూరు రూరల్‌కు బదిలీ అయ్యారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రమీల తెలిపారు. అనంతరం వీఆర్వోలతో సమావేశమయ్యారు. గ్రామాలలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా శేషారెడ్డి



శాంతిపురం: అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా ఐ.శేషారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా లింగాల ఐటీఐ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన జి.నగేష్ బీఎన్ఆర్‌పేట ఐటీఐకి బదిలీ అవడంతో ఆయన స్థానంలో శేషారెడ్డి నియమితులయ్యారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

మేజర్ పంచాయతీ ఈఓగా శ్రీకాంత్‌రెడ్డి



స్వాగతం పలుకుతున్న నాగరాజు, సిబ్బంది

వి.కోట: వి.కోట మేజర్ పంచాయతీ ఈఓగా సోమవారం శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు తదితరులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఈఓ మాట్లాడుతూ, పంచాయతీలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కుమార్‌రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

22న తిరుపతిలో బీసీల ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న పరసారత్నం, బీసీ నాయకులు

బంగారుపాళెం: ఈ నెల 22న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన బీసీల ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి పరసారత్నం పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం తగ్గువారిపల్లెలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ఆత్మ గౌరవ సభకు రాష్ట్రంలోని బీసీ మంత్రులు హాజరు కానున్నారని చెప్పారు. బీసీసీ, ఎస్సీలు తరలి వచ్చి దీనిని విజయవంతం చేశాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ నేత ఆల్మన్‌రాజ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, జానపద వృత్తి కళాకారుల జాతీయ అధ్యక్షుడు యాదగిరి, ఏపీఎఫ్ కన్వీనర్ రఘునాథ్ సింగ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బుస్సా నాగరాజగౌడ్, నాయకులు నీరజాక్షులు గౌడ్, మురళి, చిన్నయ్య పాల్గొన్నారు.

పానాటూరులో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: మండలంలోని పానాటూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రష్మిత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, మధుమేహం రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వైద్యసిబ్బంది ప్రియాంక, వీరలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

అయ్యో.. వీళ్లకూ ఎగనామమే..!

ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత మూటకట్టుకున్న నేపథ్యంలో నాన్చి..నాన్చి ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ఏడాది అనంతరం తల్లికి వందనం పథకం అమలు చేసింది. హామీ ప్రకారం రూ.15 వేలకు బదులు రూ.13వేలను మాత్రమే తల్లుల ఖాతాల్లోకి జమచేస్తోంది. ఈ సొమ్ములో కూడా మళ్లీ రెండువేలను కోత పెట్టింది. దీంతోపాటు రకరకాల సర్వేలతో పలువురినీ అనర్హులుగా చేసింది. ఆపై వీరిని ఇన్‌యాక్టివ్ జాబితాలో పెట్టింది. ముఖ్యంగా సర్పంచులు, ఎంపీటీసీలకు గౌరవవేతనం అందుతోందనే సాకుతో వారి పిల్లలకు, అలాగే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు 'తల్లికి వందనం' లేకుండా చేసింది.



- సర్పంచులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు 'తల్లికి వందనం' మొండిచెయ్యి
- చాలామంది ఇన్‌యాక్టివ్ జాబితాలో పేర్లు
- రకరకాల కొర్రీలతో అర్హులకు కట్

పలమనేరు: రూ.25 వేలకంటే తక్కువ వేతనం ఉన్న వారికంతా సంక్షేమ పథకాలు అందుతాయని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలపై ప్లేటు ఫిరాయించిచారు. హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బూచిగా చూపడం, ఏడాదిగా నాన్చుడు ధోరణి అవలంబించడం చూసి ప్రజలు విసిగిపోయారు. హామీలు నెరవేర్చడం లేదని ప్రజల్లో వ్యతిరేకత నానాటికీ పెరిగిపోతుండడంతో ఎట్టకేలకు ముక్కుతూ మూలుగుతూ 'తల్లికి వందనం' అమలు చేస్తామని ప్రకటించింది. అయితే పథకాల లబ్ధిని అర్హులకు ఇచ్చే విషయంలో పలు రకాల కొర్రీలతో కోతలు పెట్టింది. ఇందులో తనను మించిన వారు లేరని మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాటుకున్నారు. పైగా, సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలు చేసేశామని సరికొత్త బుకాయింపు మొదలెట్టారు. పైగా ఇక దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందమనే నంటూ రివర్స్ గేర్‌లో మాట్లాడటం చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

పేద ప్రజాప్రతినిధుల పిల్లల పరిస్థితి ఏమిటి?

నియోజకవర్గంలో 90 మంది సర్పంచులు 87మంది ఎంపీటీసీలు, ఐదుగురు ఎంపీపీలు, ఐదుగురు జెడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో 38మందికి ఇంటర్ లోపు చదివే పిల్లలున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టిన నిబంధనల కారణంగా వీరికి తల్లికి వందనానికి దూరమయ్యారు. అలాగే నియోజకవర్గంలో వివిధ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 360మంది వరకూ ఉన్నారు. ఈ ఉద్యోగులకు ఇంటర్‌లోపు చదివే పిల్లలున్నవారు 67మంది ఉన్నారు. వీరికి కూడా పథకం వర్తించకుండా పోయింది.

అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలట!

పెద్ద సంఖ్యలో అర్హులు అనర్హులుగా ఇన్‌యాక్టివ్ జాబితాలో పేర్లు రావడంతో తీవ్రస్థాయిలో వ్యతిరేకత పెల్లుబుకుతోంది. దీంతో సంబంధిత సచివాలయాల్లో మంగళవారం నుంచి వినతులు తీసుకుంటామని చెబుతున్నారు. ఇందులో భాగంగా చైల్డ్ ఎలిజిబుల్ బట్ డీటైల్స్ నాట్ ఫౌండ్, చైల్డ్, తల్లుల పేర్లు రేషన్ కార్డులో లేకపోవడం, తల్లీబిడ్డల ఇల్లు ఒక్కటి కాకపోవడం, యూఐడీలో తప్పిదాలు, ఈకేవైసీలో తప్పిదాలు, ఫోర్‌వీలర్, కరెంట్ బిల్లు, ఇన్‌కంటాక్స్‌లు, తప్పుడు ఎంట్రీలు, ఆధార్ ఇన్‌వాలిడ్, తల్లీబిడ్డ అందుబాటులో లేరని, సర్వేలో రాంగ్ మ్యాపింగ్, అనేబుల్ టు ఆధార్ అథంటికేషన్ వివరాలను మళ్లీ అప్‌లోడ్ చేసుకుంటామని చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే అర్హులైన పలువురికీ సాంకేతిక తప్పిదాలతో మొండిచెయ్యి చూపారనే స్పష్టమవుతోంది. వీరి వివరాలు అప్‌లోడ్ చేశాక మళ్లీ తల్లికి వందనమా..? అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

బిడ్డ చదువుకు కష్టం తప్పడం లేదు



నేను ఎస్టీకేటగిరిలో ఎంపీపీగా ఎంపికయ్యా. మాది దేవళంపెంట. పేదరికంలో ఉన్నప్పటికీ గతంలో అమ్మ ఒడి పథకం సాయంతో నా కొడుకు అరుణ్‌ని చదివించుకుంటూ వస్తున్నా. పలమనేరులోని ప్రభుత్వ కాలేజీలో ఇప్పుడు ఇంటర్ చదువుతున్నాడు. తల్లికివందనం జాబితాలో నా పేరులేదు. ఎందుకు రాలేదో కూడా నాకైతే తెలియదు. ఆ డబ్బు రాకుంటే చదివించేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు.

రోజా, ఎంపీపీ, పలమనేరు

గౌరవ వేతనాలే ఇవ్వలేదు.. 'తల్లికి వందనమూ' లేదు



నా కొడుకు తొమ్మిదో క్లాస్ చదువుతున్నాడు. ఈసారి తల్లికి వందనంలో ఇన్‌యాక్టివ్ చేశారు. సర్పంచులకు గౌరవవేతనం మూడువేలు వస్తుందని పథకం వర్తించదట! ఇది మరీ అన్యాయం. ఇప్పటికీ గౌరవవేతనాలు ఇవ్వనేలేదు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు ఇలా రాకుండా ఎందుకు చేశారు? సర్పంచుల్లో అందరూ లక్షాధికారులే ఉంటారా?

-విజయ్‌రెడ్డి, సర్పంచ్, జగమర్ల

ఇలా చేయడం అన్యాయం



సర్పంచ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తుందని తల్లి వందనం సాయం నిలుపుదల చేయడం తగదు. నేను దళితురాలిని. గానుగచింత సర్పంచ్‌గా ఉన్నా. కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. నాకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి సాయం అందింది. ఇప్పుడు తల్లికి వందనం నిలిపి వేయడం అన్యాయం.

-హేమలత, గానుగచింత సర్పంచ్, రొంపిచెర్ల మండలం

తల్లికి వందనం పడలేదు



కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ప్రతి బిడ్డకు రూ.15వేలు ఇస్తామని ఊదరగొట్టింది. నాకు గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం సొమ్ము వచ్చింది. కూటమి ప్రభుత్వ పాలనలో వేయలేదు. ప్రభుత్వ ఉద్యోగి అంటూ రిమార్క్ కాలంలో ఉండడంతో ఆశ్చర్యపోయాను. ప్రభుత్వం సర్పంచులందరినీ ప్రభుత్వ ఉద్యోగిగా పేర్కొనడం విడ్డూరంగా ఉంది.

జయసుధమ్మ, సర్పంచ్, పెద్దకొండామర్రి

నోటీస్ బోర్డు

- **రేపు ఐటీఐలో జాబ్ మేళా**

శాంతిపురం:అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. హిందాల్కో, అమరరాజా, సైబర్ డైనమిక్స్, అజిష్ట, టీవీఎస్, హెవెల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఐటీఐ పాసైన విద్యార్థులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల పత్రాల ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జెరాక్సులు తీసుకుని ఉదయం 10 గంటలకు ఐటీఐకి హాజరు కావాలని కోరారు.

- **19న ఉచిత కంటి వైద్య శిబిరం**

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 19న గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. చెన్నై ఎంఎస్ కంటి ఆసుపత్రి నుంచి ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షిస్తారన్నారు. ఎంపిక చేసిన వారిని చెన్నైకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేస్తారని, కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకురండి

సీడాప్ సంస్థ డీజీఎం సరితారెడ్డి

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు వ్యాపారవేత్తలు, ఔత్సాహికులు ముందుకొస్తే ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని సీడాప్ సంస్థ డీజీఎం సరితారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యాపార వేత్తలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమల స్థాపించేందుకు ముందుకు రావాలని కోరారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక బృందాలతో సర్వేలు చేయించినట్లు ఆమె తెలిపారు. దీనిని వ్యాపారవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనిల్, స్థానిక నాయకులు పీఎస్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై అవగాహన ర్యాలీ



తీర్థంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: తీర్థం పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం అతిసారం నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి పద్మావతి మాట్లాడుతూ, ఒక రోజులో 3 లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరేచనాలు అయితే అతిసారంగా గుర్తించాలన్నారు. పిల్లలకు పాలు పట్టేముందు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. 6 నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలన్నారు. డయేరియా వచ్చినప్పుడు తప్పనిసరిగా వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. వ్యాధులు వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించడం కంటే ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్ఎస్ శ్రీదేవి, ఎల్‌టీ హరిప్రసాద్, రాజారెడ్డి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: కలుషితమైన ఆహారం తినొద్దు... అతిసారం బారిన పడొద్దు అని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అతిసారంపై జూలై 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈగలు వాలిన ఆహారం, కలుషితాహారం, సద్ది అన్నం తినడం వలన విరోచనాలు, వాంతులయ్యే అవకాశం ఉందని, ఇలాంటి లక్షణాలుంటే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బహుద్దీన్, జమున ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగా శిక్షణ



యోగా శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు

వి.కోట : స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర వసతి గృహాల విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం బెంగళూరుకు చెందిన స్వామి వివేకనందా విశ్వవిద్యాలయ అనుసంధాన కళాశాల విద్యార్థులు యోగాపై వేర్వేరుగా అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజూ యోగా చేస్తే ఆరోగ్యపరంగా కలిగే ప్రయోజనాలను వివరించారు. వివిధ ఆసనాలు ఏలా వేయాలో నేర్పించారు. కళాశాల విద్యార్థినులు గాయత్రి, జయశ్రీ, హసిత, పూజితరెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన



సూపర్‌వైజర్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బైరెడ్డిపల్లె: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు సోమవారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలనూ అంగన్‌వాడీలకు వర్తింపచేయడం లేదని నిరసించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తల్లికి వందనం పథకం అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఏడాది కాలంలో చేసిందేమీ లేదని విమర్శించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవికి వినతి పత్రం ఇచ్చారు. వెంకటరత్నమ్మ, శకుంతల, తిప్పక్క, సరోజ, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..



పలమనేరులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు తమకూ వర్తింపచేయాలని కోరుతూ పలమనేరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. తమను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం, పింఛన్లు లాంటివి తమకు రాకుండా కొర్రీలు పెట్టడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు అండగా ఉంటామని ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా దగా చేస్తున్నారని విమర్శించారు. తమకు న్యాయం చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. నాయకురాళ్లు లక్ష్మీదేవి, లక్ష్మి, సుమ, అనుపమ, సరస్వతి, ఫరీదా, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయరూ!

- విద్యార్థుల సంఖ్య పడిపోయి పదేళ్ల క్రితం స్కూలు మూసివేత
- పిల్లల సంఖ్య పెరగడంతో స్కూలు మంజూరు చేయాలని దుస్సావారిపల్లె వాసుల వినతి



పాఠశాల సమస్యను చెబుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు

రొంపిచెర్ల: మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీ దుస్సావాండ్లపల్లెకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ, ఇక్కడ ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో పదేళ్ల క్రితం మూసివేశారన్నారు. ఇప్పుడు 20 నుంచి 30 మంది పిల్లలు ఉన్నారని, ఇక్కడ స్కూలు లేకపోవడంతో మల్లెలకస్పా, పీలేరు, ఇతర ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీని వలన నెలకు రూ.500 ఆటో చార్జీలు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వగ్రామంలోనే మళ్లీ స్కూలును పునఃప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం శూన్యమని, జిల్లా ఉన్నతాధికారులైనా తమ ఊరి పిల్లల సమస్యపై స్పందించాలని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సురేష్ రెడ్డి



చౌడేపల్లె: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సురేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మదనపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా పనిచేస్తున్న చందన పుంగనూరుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పథకాల అమలు
- పేర్లు మార్చి ఆ పథకాలనే కాపీ కొట్టిన చంద్రబాబు
- పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న వెంకటేగౌడ

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం కాపీ కొట్టిందని, తమ పథకాల పేర్లు మార్చి అమలు చేస్తోందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త ఎన్. వెంకటేగౌడ ఎద్దేవా చేశారు. తమ పార్టీ పథకాలు బాగా లేవని, సంక్షేమంతో అప్పుల ఊబిలో కూర్చేస్తున్నారని కువిమర్శలు చేసిన కూటమి నేతలకు ఇప్పుడవే పథకాలను అమలు చేయడం ఎందుకని సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ రూపొందించిన జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లేనిపోని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏడాదికొక్కటి అదిగో..ఇదిగో అంటూ ఎన్నికల వరకూ సాగదీయం ఖాయంగా కనిపిస్తోందన్నారు. నాటి సంక్షేమ పాలనకు నేటి కూటమి కష్టాల పాలకున్న తేడాను ప్రజలు బాగా తెలుసుకున్నారన్నారు. కూటమి ఏడాది పాలనలో రెడ్‌బుక్ పేరిట సాగిన అరాచకాలు, అక్రమాలను ఈ పుస్తకంలో కళ్లకు కట్టినట్టు రాశారన్నారు. దీన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. తల్లికి వందనం హామీతోనే సూపర్‌సిక్స్ మొత్తం ఇచ్చేసినట్లు కూటమి నేతలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డికి, ఇచ్చిన హామీలను అటకెక్కించి వ్యతిరేకత కట్టుకట్టుకున్న కూటమి ప్రభుత్వానికి వ్యత్యాసమేమిటో ప్రజలకే తేటతెల్లమైందన్నారు. ఎవరికి ఎలా చేయాలో త్వరలో జనమే నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో పలమనేరు, గంగవరం కన్వీనర్లు బాలాజీనాయుడు, భాస్కర్‌రెడ్డి, నాయకులు మండీ సుధా, జాఫర్, ప్రహ్లాద, రఘునాథ్, గిరిరాజారెడ్డి, శ్రీరాములురెడ్డి, దయానందగౌడ, చలపతిరెడ్డి, రాజారెడ్డి, కౌన్సిలర్లు రవి, రహీంఖాన్, నాగరాజు, శ్యాం, శ్యామ్‌సుందర్‌రాజ్, హైదర్, యూత్ నాయకులు కిశోర్, మజ్జు, నవీన్, సుబ్బు, రెడ్డెప్పరెడ్డి, షరీఫ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.